

పెదవి విరుపు!

కేంద్ర ప్రభుత్వం వివిధ పంటల మద్దతు ధరలను పెంచుతూ బుధవారం విడుదల చేసిన ప్రకటనపై రైతులు పెదవి విరుస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాగు ఖర్చులకు తగ్గట్టుగా పంటల మద్దతు ధరలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగినంతగా పంటలకు మద్దతు ధరలు పెరగడం లేదని అంటున్నారు. ఎకరానికి వరి సాగుకు రూ. 45వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు అవుతోందని, వాతావరణం సహకరిస్తే బయటపడతామని, లేకుంటే ఖర్చులు కూడా రావని పేర్కొంటున్నారు. మద్దతు ధర మరింత పెంచితేనే రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు.

కేంద్రం పెంచిన పంటల మద్దతు ధరలపై అన్నదాతల ఆవేదన

క్వింటా వరికి రూ. 69, మినుముకు రూ.400, పెసరకు రూ.86, మొక్కజొన్నకు రూ.175 పెంచుతూ నిర్ణయం

పెట్టుబడితో పోల్చితే ఈ మద్దతు ధరలు అంతంత మాత్రమే అంటున్న రైతులు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఖరీఫ్‌లో 1.62 లక్షల హెక్టార్లలో వరి సాగు జరగనుంది. రబీ సీజన్‌లో మినుము పంట 1.40 లక్షల హెక్టార్లలో, మొక్కజొన్న 12వేల హెక్టార్లలో సాగు చేస్తారు. ఖరీఫ్‌లో ఇతర పంటలతో పోలిస్తే వరి సాగు అధికంగా ఉంటుంది. గతేడాది ధాన్యం క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంచగా, క్వింటా ధాన్యం సాధారణ రకం రూ.2,300, ఏ-గ్రేడ్ ధాన్యం 2,320 మద్దతు ధరగా పలికింది. ఈ ఏడాది సాధారణ రకం, ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు కేవలం రూ.69 మాత్రమే పెంచారు. దీంతో 2025-26 సంవత్సరానికి క్వింటా ధాన్యం మద్దతు ధర 2,389లకు పెరుగుతుంది. దీంతో ఎకరానికి సుమారుగా 22 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.1,518 మద్దతు ధర రూపంలో రైతులకు లభించే అవకాశం ఉంది. రబీ సీజన్‌లో సాగు చేసే మినుము పంటకు గతేడాది క్వింటాకు రూ.450 పెంచడంతో, మినుము క్వింటాకు మద్దతు ధర రూ.7,400లుగా నిర్ణయించారు. ఈ ఏడాది మద్దతు ధరకు మినుము కొనగోళ్లు జరగలేదు. క్వింటాలు మినుము రూ. 6,800లకు కొనుగోలు చేశారు. వచ్చే సీజన్‌కు సంబంధించి మినుము క్వింటాకు రూ.400 పెంచారు. దీంతో మినుము క్వింటాలుకు రూ.7,800లకు పెరగనుంది, పెసరకు గతేడాది క్వింటాకు రూ.124 పెంచగా, క్వింటాకు రూ.8,682 మద్దతు ధరగా ఉంది. ఈ ఏడాది పెసర మద్దతు ధరను క్వింటాకు రూ.86 పెంచారు. దీంతో పెసర క్వింటాకు రూ.8,768 పెరగనుంది. మొక్కజొన్నకు గత ఏడాది రూ. 135 పెంచగా, క్వింటా మొక్కజొన్న మద్దతు ధర రూ.2,225 వరకు పలికింది. ప్రస్తుతం మొక్కజొన్నకు క్వింటాకు రూ.175 పెంచడంతో ఈ ఏడాది మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,400లకు పెరగనుంది.

ప్రకృతి విపత్తులు సంభవిస్తే..

వరి సాగులో నారుమడులు పోసే దశ నుంచి కుప్పనూర్పిడి చేసి మిల్లులకు ధాన్యం చేరే వరకు వాతావరణం అనుకూలంగా ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. పంట చేతికొచ్చే సమయంలో తుపానుల కారణంగా భారీవర్షాలు కురిసి రైతులు నష్టపోతూనే ఉన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసే మంచుకారణంగా ధాన్యంలో తేమశాతం అధికంగా ఉందని, ధాన్యంలో నూకశాతం అధికంగా ఉందని, తప్పతాలు పేరుతో ధాన్యం మద్దతు ధరలో వ్యాపారులు, మిల్లర్లు కోత పెడుతూనే ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీసీజన్‌లలో వరికోతల సమయంలో వర్షాలు కురవడంతో ధాన్యం భద్రపరిచేందుకు జాగా లేక రైతులు 75కిలోల బస్తా ధాన్యం రూ. 1,725 నుంచి రూ.1740 బదులుగా రూ.1500లోపు విక్రయించాల్సి వచ్చింది. ఇన్ని ఇబ్బందుల మధ్య వ్యవసాయం లాభసాటిగా ఉండటం లేదని అంటున్నారు. మద్దతు ధరలను మరింతగా పెంచితే రైతులకు మేలు జరుగుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

పెట్టుబడి కూడా రాని పరిస్థితి!

వరి, ఇతర పంటల సాగుకు ఏటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. వరి సాగులో దుక్కి, దమ్ము, నారుమడి, నాట్లు, కలుపు తీత, మూడు, నాలుగు విడతలుగా ఎరువులు, రెండు మూడు విడతలుగా పురుగు మందులు, గుళికలు జల్లడానికి, కూలీలు ఖర్చులు, కోత, కట్టివేత, కుప్పనూర్పిడి, ధాన్యం రవాణా తదితర ఖర్చులన్నీ కలిపి ఎకరానికి రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడిగా పెట్టాల్సి వస్తోందనేది రైతుల మాటగా ఉంది. ప్రస్తుతం పెంచిన మద్దతు ధరతో పోలిస్తే ఎకరానికి 22 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తే రూ.52,558 వరకు నగదు వస్తుందని, పెట్టుబడికి సంబంధించిన వడ్డీ, మిగతా 4లో..



నిర్లక్ష్యం వహిస్తే థియేటర్లపై కఠిన చర్యలు
» మచిలీపట్నం ఆర్డీవో స్వాతి 4లో



ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం
» ఎమ్మెల్యే బుద్దప్రసాద్ 6లో

యోగతో మానసిక ఒత్తిడి దూరం
» ఎస్పీ ఆర్.గంగాధరరావు 4లో



చోరీలకు పాల్పడుతున్న నిందితులు

చైన్ స్నాచింగ్ కూలీలు

వ్యవసాయ కార్మికుల వేషధారణలో చోరీలు

- గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలే లక్ష్యం
- నలుగురిని అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు
- నిందితుల్లో ఇద్దరు మహిళలు
- రూ. 30లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

అతడు లుంగీ కట్టుకుని, ఒంటిపై బనియన్, మెడలో తువ్వాలుతో ఉంటాడు. సాదాసీదా చీరతో ఓ మహిళ అతడి వెంట ఉంటుంది. ఇద్దరూ చూడడానికి వ్యవసాయ కూలీలుగా కనిపిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై తిరుగుతారు. ఇలా తిరుగుతూనే ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు. ఏదో చిరునామా అడిగినట్టుగా ఆ మహిళలను ఆపి మెడలో ఉన్న బంగారు గొలుసులు లాక్కుపోతారు. ఇలా గ్రామీణ ప్రాంత మహిళలను టార్గెట్ చేసుకుని స్నాచింగ్‌లు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను విజయవాడ సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు చూపుతున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, మే 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉప్పుటూరు గ్రామానికి చెందిన అచ్చి గిరిబాబు, అచ్చి మహేష్ అన్నదమ్ములు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకునేవారు. ఇద్దరూ కలిసి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. దీనితో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో బంగారం ధర విపరీతంగా పెరగడంతో చైన్ స్నాచింగ్‌లు చేయడానికి ప్రణాళిక రచించారు.

ఒంటరి మహిళలతో సహజీవనం

గ్రామాల్లో భర్తతో విడిపోయిన మహిళలను గుర్తించి, వారికి అండదండగా ఉంటామని నమ్మించి జీవితంలోకి తెచ్చుకుంటారు. వారితో సహజీవనం చేస్తారు. అన్నదమ్ములు ఇద్దరూ చెరో మహిళను జీవిత భాగస్వామిగా చేసుకుంటారు. తర్వాత ద్విచక్ర మిగతా 4లో..

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.17లక్షలు కాజేశారు!

- మోసపోయిన పటమట అశోక్‌నగర్‌కు చెందిన వ్యక్తి
- ఘటనపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు



పెనమలూరు, మే28(ఆంధ్రజ్యోతి): "ముంబై క్రైం బ్రాంచ్ నుంచి కాల్ చేస్తున్నాం. మీరు వాడుతున్న మొబైల్ నంబర్లు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తాం" అంటూ బెదిరించి ఒక వ్యక్తి ఖాతాలోని రూ.17 లక్షల సొమ్మును కేటుగాళ్లు కాజేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 4వ తేదీన పటమట అశోక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి ముంబై క్రైం బ్రాంచి నుంచి ఫోన్ చేస్తున్నామని ఒక కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబర్లను చట్ట విరుద్ధ కార్యకలాపాలకు వాడుతున్నారని, మిమ్ములను అరెస్టు చేస్తామని బెదిరించారు. 5వ తేదీన మరో వీడియో కాల్‌లో న్యాయమూర్తి డ్రెస్ వేసుకున్న వ్యక్తి మీరు ఏడు రోజుల పాటు మిగతా 4లో..

విజయవాడ టు అమెరికా!

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు డైరెక్టు ఫ్లైట్ నడిపే అంశంపై విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు ఇచ్చిన హామీ జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్తున్న వారిలో విదేశాలకు వెళ్లే డేటాపై అధ్యయనం చేస్తున్నారు. కేంద్ర స్థాయిలో వివిధ శాఖలను సమన్వయం చేయడంతో పాటు విమానయాన సంస్థలను మెప్పించగలిగితే తప్ప ఇప్పటికిప్పుడు ఈ విమాన సర్వీసును నడపటం సాధ్యం కాదని తెలుస్తోంది. ముందు ఆసియా దేశాలకు విమానాలను నడిపి సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విమాన సర్వీసుపై విజయవాడ, మచిలీపట్నం ఎంపీల హామీ

చర్చనీయాంశంగా న్యూయార్క్‌కు డైరెక్ట్ ఫ్లైట్ అంశం

- ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళుతున్న వారిలో విదేశాలకు వెళ్లే డేటాపై అధ్యయనం
- కేంద్ర స్థాయిలో మూడు శాఖలను మెప్పించాలి.. విమానయాన సంస్థలను ఒప్పించాలి
- ఆసియా దేశాలకు ముందు విమానాలను నడిపి సమగ్ర అధ్యయనం అవసరం
- సాధ్యాసాధ్యాలపై నడుస్తున్న చర్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇటీవల జరిగిన ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ సమావేశం అనంతరం మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమానాల ఆపరేషన్స్‌కు సంబంధించి ఇచ్చిన హామీలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వీటిలో విజయవాడ నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు డైరెక్ట్ ఫ్లైట్ అంశం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇప్పటికిప్పుడు ఈ విమాన సర్వీసు నడపటానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై పెద్ద చర్చే నడుస్తోంది. విజయవాడ నుంచి ప్రస్తుతం ఢిల్లీకి మూడు దేశీయ విమానాలు నడుస్తున్నాయి. ఢిల్లీకి వెళుతున్న విమానాల్లో సగటున 120 మంది ప్రయాణికులు విజయవాడ నుంచి బయలుదేరి వెళుతుంటే, వీరిలో 60 శాతం మేర ఢిల్లీ విమానాశ్రయం నుంచి అమెరికా తదితర ప్రపంచ దేశాలకు వెళ్లేవారే ఉన్నారు. ఇవి ఎయిర్ పోర్టు అధికారులు చెబుతున్న గణాంకాలు. ఢిల్లీకి వెళుతున్న విమాన ప్రయాణికులను సర్వే చేయగా తెలుసుకున్న విషయం ఇది. ఈ సర్వే ఆధారంగా అమెరికాకు నేరుగా విమాన సర్వీసు నడిపే విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయి. వీటిని అధిగమించకపోతే విమాన సర్వీసు నడపటం సాధ్యం కాదు.



పరిశీలించాల్సిన అంశాలు

విజయవాడ నుంచి ఢిల్లీ వెళుతున్న వారు కానీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు వెళ్లే విమాన ప్రయాణికులలో సగం మంది విదేశాలకు వెళ్లే వారుంటున్నారన్నది గతంలో జరిపిన సర్వేల్లో స్పష్టమైంది. ప్రస్తుతం ఢిల్లీకి వెళుతున్న మన ప్రయాణికుల్లో 60 శాతం మంది విదేశాలకు వెళుతున్నారు. వీరిలో ఎంత మంది అమెరికాకు వెళుతున్నారన్నదానిపై సమగ్ర సర్వే జరగాల్సి ఉంది. అమెరికాకు ఎక్కువ సంఖ్యలో ఎక్కడికి మిగతా 4లో..



కడపలో బుధవారం జరిగిన టీడీపీ మహానాడులో వేదికపై పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో ముచ్చటిస్తున్న జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు

ఎన్టీఆర్ పేరే ఓ సంచలనం
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య 6లో



మేడూరు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు
» రూ.3.50 లక్షల ఆభరణాలు స్వాధీనం 6లో

అప్పుల బాధ తాళలేక
» ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య 4లో

తిరువూరు చైర్‌పర్సన్ పదవి ఇక టీడీపీ ఖాతాలోకే..!

- వైసీపీ కౌన్సిలర్ పరస సత్యనారాయణ టీడీపీలో చేరిక
- అనూహ్యంగా 11కు పెరిగిన బలం
- జూన్ 2న చైర్‌పర్సన్ ఎన్నిక లాంచనమే!

తిరువూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటిలో చైర్‌పర్సన్ ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ బలం అనూహ్యంగా పెరిగింది. దీంతో చైర్‌పర్సన్ పదవిని ఆ పార్టీ కైవశం చేసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బుధవారం వైసీపీకి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ పరసా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పరసా బాబురావు టీడీపీలో చేరడంతో ఎన్నికకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను టీడీపీ చేరుకుంది. మొత్తం 20 మంది సభ్యులకు గాను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటుగా 11 ఓట్లు టీడీపీకి ఉండటంతో దాదాపు ఎన్నిక లాంచనమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 17 స్థానాలు గెలుపొంది, పాలకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి వైసీపీ కౌన్సిలర్లలో అనేక విభేదాలు తలెత్తాయి. కొందరు వైసీపీ మిగతా 4లో..



టీడీపీ కండువ కప్పుకున్న కౌన్సిలర్ పరస సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బాబురావు



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం







పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు



ప్రత్యేక ఆకర్షణగా ఎన్టీఆర్ వేషధారి..









నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు



పీవీఆర్ థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో స్వాతి

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

» పీవీఆర్ థియేటర్‌ను తనిఖీచేసిన ఆర్డీవో

మచిలీపట్నం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : థియేటర్లలో తినుబండారాలు, ఇతర వస్తువులు ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయించరాదని నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బందరు ఆర్డీవో కె.స్వాతి థియేటర్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని పీవీఆర్ థియేటర్‌ను ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. లైసెన్స్ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మీడియాతో మాట్లాడుతూ, కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు నగరంలోని థియేటర్లను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. థియేటర్లలో తినుబండారాలు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించినా, ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు కల్పించకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలపరిమితి దాటినవి ఎట్టి పరిస్థితుల్లో లేకుండా చూడాలని సూచించామన్నారు. తనిఖీల్లో ఆర్డీవో వెంట తహసీల్దార్ నాగభూషణం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కోడూరు అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల వద్ద ఆందోళనలో రైతులు

తాత్కాలిక గేట్లతో ఫలితం శూన్యం!

» అవుట్ ఫాల్స్ స్లూయిస్‌కు ఫైబర్ గేట్ల ఏర్పాటు

» పంట పొలాల్లోకి చేరుతున్న ఉప్పునీరు

కోడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండలంలోని ఉల్లిపాలెం సమీపంలో కృష్ణానది కరకట్టపై ఉన్న అవుట్ ఫాల్స్ స్లూయిస్‌కు తాత్కాలిక ఫైబర్ గేట్లను ఇరిగేషన్ అధికారులు అమర్చారు. తాత్కాలిక గేట్లు నిర్మించినా ఫలితం శూన్యమని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద గేట్లు బిగించగా, బుధవారం ఎగువకు భారీ స్థాయిలో ఉప్పు నీరు రావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, అవుట్ ఫాల్స్ గేట్ల కింద తాత్కాలిక గేట్ల వల్ల సముద్రపు ఉప్పునీరు ఎగువకు రావటం ఏ మాత్రం ఆగటం లేదని, ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి ఉప్పునీరు ఎగువకు రాకుండా అవుట్ ఫాల్స్ వద్ద బెడ్ కాంక్రీట్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాలెంపాటి రాంబాబు, అన్నె బుచ్చిరాంబాబు, దారపురెడ్డి అంజియ్య, బాదర్ల మునేశ్వరరావు, బడే ఆంజనేయులు, బడే నారాయణ, రెడ్డోతు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎగువకు వస్తున్న ఉప్పునీరు

విజయవాడ టు అమెరికా!

(3వ పేజీ తరువాయి)

వెళుతున్నారన్నది కూడా లెక్క తేలాల్సి ఉంటుంది. అమెరికాకు న్యూయార్క్‌కే వెళుతున్నారా.. చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో ఇలా ఇతర ప్రాంతాలకు వెళుతున్నారా అన్నది కూడా తెలియాలి. విజయవాడ నుంచి న్యూయార్క్‌కు విమాన సర్వీసు నడిపితే.. మిగిలిన ప్రాంతాలకు వెళ్లే వారు ఈ సర్వీసును ఆదరిస్తారా అన్నది కూడా పరిగణనలోకి తీసుకోవాలి. విజయవాడ నుంచి అమెరికాకు విమాన సర్వీసు నడవాలంటే 350 - 400 మంది ప్రయాణికుల కెపాసిటీ ఉన్న విమాన సర్వీసును నడిపితేనే విమానయాన సంస్థలకు వయబిలిటీ ఉంటుంది. విజయవాడ నుంచి ఒక్క రోజే 350 మందికి పైగా ప్రయాణికులు న్యూయార్క్‌కు ప్రయాణించగలరా? అన్న విషయాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. డైలీ ఫ్లైట్‌కు ఇంత సంఖ్య ఉండదనుకుంటే.. వారానికో ఫ్లైట్ నడపాలన్న అంశం కూడా తెర మీదకు వచ్చే అవకాశం ఉంది. అమెరికా వెళ్లే వారికి డైలీ ఫ్లైట్స్ దేశంలోని పలు విమానాశ్రయాల నుంచి అందుబాటులో ఉండగా.. విజయవాడ నుంచి వెళ్లటానికి వారం రోజుల పాటు నిరీక్షిస్తారా? అన్నది కూడా అధ్యయనం చేయాల్సిన విషయం. కాబట్టి సమగ్ర సర్వే, అధ్యయనం లేకుండా అమెరికా వంటి పెద్ద దేశానికి ఒక ప్రాంతాన్ని ఎంచుకుని డైరెక్ట్ ఫ్లైట్ నడిపే సాహసం చేస్తే అది వయబిలిటి కాకపోతే ఏమిటన్నది కూడా ఆలోచించుకోవాల్సి ఉంటుంది.

మెప్పించి.. ఒప్పించాలి!

అమెరికాకు డైరెక్ట్ ఫ్లైట్ నడిపే విషయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కృషి ఒక్కటే సరిపోదు. కేంద్ర విదేశీ మంత్రిత్వశాఖ, కేంద్ర వాణి జ్య మంత్రిత్వ శాఖల సమన్వయంతో గట్టిగా కృషి చేస్తే తప్ప సాకారం కాదు. ఈ మూడు సంస్థలను ఏకతాటి మీదకు తీసుకు రావాల్సి ఉంటుంది. ఈ మూడు శాఖలను ఏక తాటిమీదకు తీసుకు వచ్చిన తర్వాత విమానయాన సంస్థలను కూడా మెప్పించి.. ఒప్పించాల్సి ఉంటుంది. విమానయాన సంస్థలు ముందుకు రానంత వరకు కూడా అమెరికాకు నేరుగా విమాన సర్వీసును నడపటం చాలా కష్టం.

బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ కావాలి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు కానీ మరేదైనా ప్రాంతానికి కానీ విమాన సర్వీసును నడపాలంటే అంత తేలిక కాదు. విజయవాడ విమానాశ్రయానికి బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ కావాలి. బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ లేకుండా విమాన సర్వీసును నడిపే పరిస్థితి లేదు. బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ అనేవి ఇండియా, అమెరికా ద్వైపాక్షిక సంబంధాల మీద ఆధారపడి ఉంటాయి. పైన చెప్పుకున్నట్టు పౌర విమానయాన శాఖ, విదేశీ మంత్రిత్వ శాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖకు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించటం ద్వారానే బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ వస్తాయి. అమెరికాకు విజయవాడ నుంచి ఒక విమాన సర్వీసు నడిపితే .. అక్కడి విమానయాన సంస్థకు కూడా విజయవాడ రావటానికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. ప్రతి విమానాశ్రయానికి నిర్దేశిత బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ ఉంటాయి. కొత్తగా కల్పించకుండా.. ఉన్న వాటినే సర్దుకోమంటే చాలా కష్టం. అమెరికా నుంచి మన దేశంలో ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూరులకు విమాన సర్వీసులలో ఏదైనా ఒకదానిని కుదించుకుని విజయవాడకు నడపాలి. ఆ విమానాశ్రయాలకున్న డిమాండ్‌ను కాదనుకుని ఆ దేశ విమానయాన సంస్థ విజయవాడకు ధైర్యంగా నడపగలదా అన్నది కూడా చూడాల్సిన అవసరం ఉంది.

సమగ్ర అధ్యయనం తప్పనిసరి

అమెరికా వంటి దేశాలకు విమానాలు నడపాలనుకున్నపుడు ప్రయాణికుల అంచనాకు సంబంధించి సమగ్ర సర్వేతో కూడిన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ముందుగా మన దగ్గర నుంచి విదేశాలకు వెళుతున్న ఆప్షన్స్‌ను పరిశీలించాలి. వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) విధానంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపటం ద్వారా పర్యాటకుల కోసం విజయవాడ నుంచి థాయ్‌ల్యాండ్, మలేషియా, శ్రీలంక తదితర దేశాలకు 120 సీటర్ విమానాలను నడిపి పరిశీలించవచ్చు. వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించి సింగపూర్, దుబాయ్ వంటి దేశాలకు కూడా వీజీఎఫ్ విధానంలో విమాన సర్వీసులను నడిపితే .. అంతర్జాతీయానానికి ఉన్న డిమాండ్‌పై అవగాహన వస్తుంది. వీటి ఆధారంగా అమెరికాకు విమాన సర్వీసు అంశంపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.

తిరువూరు చైర్‌పర్సన్ పదవి ఇక టీడీపీ ఖాతాలోకే..!

(3వ పేజీ తరువాయి)

కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఈ పంచాయితీ తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది. పార్టీ ఆదేశాలలో అప్పటి చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చెయ్యడంతో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. ఈ నెల 19, 20 తేదీల్లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యాంప్ రాజకీయానికి తెరతీసిన వైసీపీ అధిష్ఠానం తమ సభ్యుల్ని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌కు పంపకపోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. తిరిగి జూన్ 2న ఎన్నిక జరుగుతుందని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వంలో అభివృద్ధి లేకపోవడం, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో వైసీపీకి చెందిన ఏడుగురు (1, 3, 9, 11, 14, 18, 19 వార్డులు) కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారు. బోర్డులో మూడు స్థానాలు ఉన్న టీడీపీ ప్రస్తుతం 11 స్థానాలకు చేరింది. జూన్ 2న నిర్వహించే ఎన్నిక లాంచనమే అని మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి టీడీపీ ఖాతాలో చేరుతుందని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

పెదవి విరుపు!

(3వ పేజీ తరువాయి)

ఇతరత్రా ఖర్చులతో పోలిస్తే రైతులకు ఏమీ మిగలదనే వాదన రైతుల నుంచి వస్తోంది. కౌలు రైతులు ఎకరానికి కనీసంగా రూ.9వేలు, గరిష్ఠంగా 18వేల వరకు కౌలుగా చెల్లించాల్సి ఉందని, ఈ ఖర్చులన్నీ లెక్కగడితే కౌలురైతులకు ఏమీ మిగలదు. స్వామినాథన్ కమిషన్ రైతులు పెట్టిన పెట్టుబడికి అదనంగా 30శాతం కలిపి మద్దతు ధరగా ఇస్తేనే రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని తన నివేదికలో పేర్కొన్నారని, ఆయన ఇచ్చిన నివేదికను ఇంతవరకు అమలు చేయలేదని రైతులు వాపోతున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.17 లక్షలు కాజేశారు

(3వ పేజీ తరువాయి)

డిజిటల్ కస్టడీలో ఉండాలని ఆదేశించారు. దీంతో భయపడిన సదరు వ్యక్తి కెనరా బ్యాంకులోని తన భార్య పేరిట ఉన్న ఎఫ్‌డీని రద్దు చేసి రూ. 17 లక్షలను వారు చెప్పిన ఖాతాలో ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేశాడు. తర్వాత కొన్ని రోజులకు తాను మోసపోయానని గ్రహించి మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చైన్ స్నాచింగ్ కూలీలు

(3వ పేజీ తరువాయి)

వాహనాలపై వారిని ఎక్కించుకుని ఎంపిక చేసుకున్న గ్రామాల్లో నివాసం ఉంటారు. గ్రామాలకు శివారున ఉండే ఖాళీ స్థలాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుంటారు. పాడి రైతులమని నమ్మించేందుకు రెండు గేదెలను గుడారం ముందు కట్టేస్తారు. తర్వాత వ్యవసాయ కూలీలుగా పనులకు వెళ్తారు.

చిరునామా అడుగుతున్నట్టు నటిస్తూ..

ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు. వారి వద్దకు వెళ్లిన తర్వాత వాహనాన్ని ఆపి చిరునామా అడుగుతారు. వారు సమాధానం చెప్పేలోపు మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోతారు. నెల్లూరు జిల్లాలో మొత్తం 12 చైన్ స్నాచింగ్‌లు చేసి జైలుకు వెళ్లి వచ్చారు. తర్వాత మకాంను ఎన్టీఆర్ జిల్లాకు మార్చారు. ఇబ్రహీంపట్నం మండలం దొనబండకు చెందిన గాలేటి వెంకటరమణ అనే మహిళతో గిరిబాబు, మొగిలి సంధ్యతో మహేష్ వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ ఇద్దరూ చేసే స్నాచింగ్‌లకు వారిని మోటారు సైకిళ్లపై తీసుకెళ్లేవారు. ఈ గ్యాంగ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా చోరీలకు పాల్పడింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు, జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో మూడు, మైలవరం సర్కిల్ పరిధిలో నాలుగు, తిరువూరు సర్కిల్ పరిధిలో మూడు మొత్తం 12 చైన్ స్నాచింగ్‌లు చేశారు. ఇవి కాకుండా కృష్ణాజిల్లాలో నాలుగు, ఏలూరు జిల్లాలో రెండు, తెలంగాణలో ఏడు చైన్ స్నాచింగ్‌లు చేశారు. గిరిబాబు ఒక్కడే మొత్తం 15 చైన్ స్నాచింగ్‌లు చేశాడు. తమ్ముడు మహేష్‌తో కలిసి నాలుగు చోరీలు చేశాడు. సహజీవనం చేస్తున్న వెంకటరమణతో కలిసి మూడు, సంధ్యతో కలిసి మరో మూడు చైన్ స్నాచింగ్‌లు చేశాడు. ఈ నలుగురు నిందితుల నుంచి సీసీఎస్ పోలీసులు రెండు ద్విచక్ర వాహనాలు, 476 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.30లక్షలు ఉంటుంది. ఈ గ్యాంగ్‌ను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఏఎస్ఐలు బాలయ్య, స్వామి, సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు మిథున్, సురేష్, షబ్బీర్, రమణను సీపీ అభినందించారు. వారికి నగదు బహుమతులను అందజేశారు.

అప్పుల బాధ తాళలేక ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

ఉంగుటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఓ ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొట్టిపాడులో చోటుచేసుకుంది. ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న గూడపాటి శ్రీనివాసరావు(67)గతంలో గన్నవరంలో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారినుంచి ఒత్తిళ్లు పెరగటంతో శ్రీనివాసరావు మంగళవారం ఉదయం 10.30గంటలకు పొట్టిపాడులోని సొంత పామాయిల్ తోటలో తనతో తెచ్చుకున్న గ్లైసిల్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో పడివున్న తండ్రిని చూసిన చిన్నకుమారుడు వెంటనే 108 అంబులెన్స్‌లో చినవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి బుధవారం గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.



శ్రీనివాసరావు (ఫైల్)

పోలీసు కస్టడీకి ఓలుపల్లి రంగా

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు, గన్నవరం మండలాల్లో వైసీపీ అధికారంలో ఉండగా జరిగిన అక్రమ తవ్వకాల కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగరావు అలియాస్ రంగాను విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. దీనికి సంబంధించి బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు కస్టడీకి అనుమతి ఇచ్చింది.

యోగతో మానసిక ఒత్తిడి దూరం : ఎస్పీ

మచిలీపట్నం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తూ పనిఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగ సాధన ఒక్కటే మార్గమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. బుధవారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో యోగ శిక్షణా తరగతులను ఎస్పీ ప్రారంభించారు. 'యోగాంధ్ర' కార్యక్రమంలో కృష్ణాజిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు జిల్లాలోని పోలీసు సిబ్బంది ప్రతిరోజూ యోగ శిక్షణలో పాల్గొనాలన్నారు. శిక్షణా తరగతుల్లో ఏఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి



గన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని కళాశాల అసోసియేట్ డీన్ పీవీఎస్ కిషోర్ అన్నారు. మండలంలోని కేసరపల్లి ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో 15వ వార్షిక క్రీడాదినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఎగురవేసి, మార్చ్‌ఫాస్ట్ చేశారు. క్రీడాజ్యోతిని వెలిగించి డీన్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. 410 మంది విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ సీహెచ్ వెంకట శేషయ్య, డాక్టర్ బి.కృష్ణ దీపిక, డాక్టర్ షేక్ మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగోడి సత్తా చాటిన ఎన్టీఆర్

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు





జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు.. కానూరు టీడీపీ కార్యాలయంలో వెలగపూడి శంకరబాబు, బోడె వెంకట్రామ్.. ప్రసాదంపాడులో ..

హనుమాన్‌జంక్షన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి ఢిల్లీ రాజకీయాల్లో తెలుగోడి సత్తా చాటిన ఎన్టీఆర్ చరిత్ర పురుషుడని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో ఎన్టీఆర్ విగ్రహానికి చలసాని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణామిల్క్ యూనియన్ సభ్యులు పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, పాల ఉత్పత్తి సహకార సంఘాల అధ్యక్షులు ఎనికేపల్లి శ్రీమన్నారాయణ, మరీదు సూర్యప్రకాశరావు, కొల్లి వెంకట్రావు, యనమదల బాపయ్య, కళ్లే వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, గుమ్మడి శేషగిరిరావు, అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పెనమలూరు : మండలంలో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఊరూవాడా జై ఎన్టీఆర్ నినాదాలతో మారుమోగాయి. తాడిగడప, కానూరు, పోరంకి, యనమలకుదురు గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా వీధుల్లో, టీడీపీ పార్టీ కార్యాలయాల్లో ఆయన జన్మదిన కేకులు కోసి సంబరాలు చేసుకొన్నారు. కానూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఉత్సవాల్లో టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, యువనేత బోడె వెంకట్రాంలు జన్మదిన కేకును కోసి పంచిపెట్టారు.

● పెనమలూరులో ఎన్టీర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ఇద్దరు బాలికలకు రెండు సైకిళ్లు అందజేశారు. తెలుగు యువత, శీలం ఆదాం ఆధ్వర్యంలో కొత్త ఎస్సీకాలనీలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. కిలారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 50 మంది మహిళలతో కోలాటం చేశారు. మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనందప్రసాద్, తోటకూర ఉదయ్‌భాస్కర్, పాములు, బలరామ్, నరేంద్ర, సైదులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి, వేలేరు, కొత్తపల్లి, రేమల్లె, కానుమోలు, మల్లవల్లి, బిళ్లనపల్లి, కాకులపాడు, రంగయ్యప్పారావుపేట, తిప్పనగుంట, మడిచర్ల, ఆరుగొలను, చిరివాడ, తదితర గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా బుధవారం ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. వేలేరు, కొత్తపల్లి,



రేమల్లెలో..

కానుమోలు, రంగన్నగూడెం గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, రైతులు నివాళులర్పించారు. వీరవల్లి కూడలిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. రేమల్లెలోని ఎన్టీఆర్, హరికృష్ణ విగ్రహాలకు టీడీపీ నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు



అంబాపురంలో..

ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అంబాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు చల్లగాలి సునీల్, పైడిముక్కల రాజు, సాకులూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నున్నలోని చెరువు సెంటర్, కోటగట్టు సెంటర్, హైస్కూల్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహాల వద్ద గ్రామ టీడీపీ నేతలు ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు మాదు శివరామ్‌ప్రసాద్, పామర్తి శ్రీను, యార్కారెడ్డి కోటిరెడ్డి, బేతపూడి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : యుగపురుషుడు ఎన్టీ రామారావు అని టీడీపీ సీనియర్ నాయకులు అరవపల్లి బోస్ అన్నారు. టీడీపీ వ్యవస్థాప



గన్నవరం టీడీపీ కార్యాలయంలో..

కులు ఎన్టీఆర్ జయంతిని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహంతో పాటు టీడీపీ కార్యాలయంలో కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీలు పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరావు, నాయకులు కాసన్నేని రంగబాబు, జాస్తి ఫణిశేఖర్, మోదుగుమూడి వేణు, బుస్సే నాగప్రసాద్, చిమట శ్రీనివాసరావు, ఆళ్ల దమయంతి, కాట్రగడ్డ అరుణ, జాస్తి తాతారావు పాల్గొన్నారు.

భారతీనగర్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ఎన్టీఆర్ జయంతిని ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షులు జ్యోతి, 16వ వార్డు నెంబరు గూడపాటి శివదుర్గ టీడీపీ నేతలు పాల్గొన్నారు.



కాటూరులో..

ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణ, మండల పరిధి గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెదఓగిరాలలో గ్రామపార్టీ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, పోతిరెడ్డి తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చిన ఓగిరాల సెంటర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు ఇతర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కాటూరులో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, సజ్జా మధు, సజ్జా అనూష, వేమూరు శ్రీనివాసరావు, వెంకట నారాయణ, యుగబాబు పాల్గొన్నారు. ఉయ్యూరు పట్టణ కార్యాలయంలో చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, కౌన్సిలర్లు, నాయకులు కేక్ కట్ చేశారు.



పెనమలూరులో..

ఉంగుటూరులో..



ఉంగుటూరు సెంటర్లో ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పిస్తున్న పార్టీశ్రేణులు

ఉంగుటూరు : టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతిని బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆ పార్టీశ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు సెంటర్లో తారకరామావనం వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. టీడీపీ నేతలు దాసరి శ్రీకృష్ణ, పోతినేని రామకృష్ణ, దాసరి వెంకట బాపినీడు, దాసరి రంగారావు, లంకపల్లి, ముక్కపాడు, గారపాడు గ్రామాలకు చెందిన పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పెదఅవుటపల్లి, పొట్టిపాడు, తేలప్రోలు, ఆత్కూరులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుండేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..మానికొండ, ఉంగుటూరు, నందమూరు, వేమండ, తరిగొప్పలలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు.

ఎల్వీప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైటాథాన్ రన్ 1న



వైటాథాన్ వాక్ టీషర్టును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటిన విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో వైటాథాన్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయా గంగూలీ తెలిపారు. ఈ మేరకు వైటాథాన్ రన్ టీషర్టును కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. పిల్లలలో కంటి క్యాన్సర్(రెటీనోబ్లాస్టోమా)పై అవగాహన కోసం వైటాథాన్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అనసూయా గంగూలీ తెలిపారు. రన్‌లో పాల్గొనదలచినవారు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 9247243377 నంబరును సంప్రదించాలని కోరారు.

వరి విత్తనాలు పంపిణీ




రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు

కంకిపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని పెనమలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నే ధనయ్య అన్నారు. ఉప్పలూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నే ధనయ్య మాట్లాడుతూ, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ లాం సోనియా, ఏవో పీఎం కిరణ్ ఉప్పలూరు టీడీపీ అధ్యక్షులు చలసాని రాధాకృష్ణమూర్తి, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కంకిపాడు మండల సమావేశం 31న

మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనూష తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడుతూ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు. మండలంలోని పెండింగ్ సమస్యలు చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఉయ్యూరులో యోగా అవగాహన ర్యాలీ

కంకిపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఎంపీడీవో అనూష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. తహసీల్దార్ భన్నారాయణ మాట్లాడుతూ, క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో బసవయ్య, యోగా శిక్షకులు వీరంకి రమేష్, మిరియాల సాయికుమార్, కన్యాకుమారి పాల్గొన్నారు. **ఉయ్యూరు** : యోగా చేయండి ఆరోగ్యంగా జీవించండి అంటూ నినాదాలు చేస్తూ బుధవారం ఉయ్యూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాంధ్ర మండల కమిటీ, ఏజీఅండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్, ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి యోగాపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్** : యోగసాధనతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని సాధించవచ్చని బాపులపాడు తహసీల్దార్ బి. మురళీకృష్ణ తెలిపారు. యోగాంధ్ర 2025లో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల యోగా శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో జోగేశ్వరరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



జంక్షన్‌లో..

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉంగుటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ ఉంగుటూరు విద్యుత్ సెక్షన్ పరిధిలో 400కేవీ విద్యుత్ కొత్తలైన్ల ఏర్పాటు పనులు పూర్తి కానందున గురు, శుక్రవారంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఉంగుటూరు ఏఈ అనగాని నాగేశ్వరరావు తెలిపారు. కొయ్యగూరపాడులో జరుగుతున్న నూతన లైన్ల ఏర్పాటు పనులను విజయవాడ విద్యుత్‌శాఖ ఏడీఈ విజయ్‌కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, గారపాడు, పొణుకుమాడు, ఎలుకపాడు, నాగవరప్పాడు, తుట్టగుంట, వెన్నూతల, వెల్దిపాడు, తరిగొప్పల, వేంపాడుల్లో గురువారం, శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదని తెలిపారు.

గన్నవరం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు తెలిపారు. 33/11 కేవీ వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం గ్రామంతో పాటు తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కొత్తగూడెం, చిక్కవరం, కండ్రిక, చింతగుంట, బీబీగూడెం, గొల్లనపల్లి, స్టేట్ స్కూల్, గన్నవరం ఐటీఐ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఉయ్యూరు శాంతి థియేటర్‌లో ఆహార పదార్థాల ధరలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

సినిమా థియేటర్ల తనిఖీ

ఉయ్యూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో సినిమా థియేటర్లను తహసీల్దార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. శాంతి థియేటర్‌లో ఆహార పదార్థాల ధరలు తనిఖీ చేసి, బోర్డుపై ధరలు స్పష్టంగా కన్పించేలా ఉండాలని థియేటర్ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆర్ఐ యతేంద్రియులు, వీఆర్వోలు తనిఖీలో పాల్గొన్నారు.

గన్నవరం : థియేటర్ల నిర్వాహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ కేవీ శివయ్య ఆదేశించారు. స్థానిక శాంతి థియేటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. థియేటర్ విస్తీర్ణం, సిట్టింగ్, అనుమతులను పరిశీలించారు. డీటీ భవాని, ఆర్ఐ రవి, జూనియర్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ బుధవారం జంక్షన్‌లో శ్రీకృష్ణా థియేటర్‌ను తనిఖీ చేశారు. థియేటర్‌లో సేఫ్టీ మెజర్స్, ధరల పట్టిక, సదుపాయాలు టిక్కెట్లు ధరలు పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రాజేందర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్‌లో సమైక్యతా ర్యాలీ



హనుమాన్‌జంక్షన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దేశం యావత్తు ఖండించడానికి సిద్ధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు అన్నారు. ఉగ్రవాద కాల్పులకు నిరసనగా బుధవారం జంక్షన్‌లో సీపీఎం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ జంక్షన్ నాలుగు రోడ్లలో సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, మాదల వెంకటేశ్వరరావు, ఆర్‌సీపీ రెడ్డి, ధనలక్ష్మి, స్థానిక నాయకులు బేత శ్రీనివాసరావు, రాజనాల సురేష్, అబ్దుల్ బారి, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి కుంభ హారతి అందజేత

గన్నవరం : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయానికి కుంభ హారతిని బుధవారం అందజేశారు. పట్టణానికి చెందిన పబ్బతి చంద్రకాంత్, దుర్గా భవానీల కుమార్తె రిషితశ్రీ సంజన పుట్టిన రోజు సందర్భంగా వెండి కుంభ హారతిని ఆలయ కమిటీ వారికి అందజేశారు.







మహా సంబరం తెలుగుదేశం ఆధ్వర్యంలో కడపలో జరుగుతున్న మహానాడు రెండో రోజు సభలకు పలువురు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వేదికపై జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొనగా, జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబుకు ప్రమాణ పత్రాన్ని అందజేస్తున్న పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, వేదికపై ప్రసంగిస్తున్న స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ పట్టాభి, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న రాష్ట్ర మాదిగ సంక్షేమ శాఖ చైర్మన్ శ్రీదేవి, చంద్రబాబుతో టీడీ జనార్దన్



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

ఎన్టీఆర్ పేరే ఓ సంచలనం

● రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు పేరే ఓ సంచలనమని, తెలుగు సినిమా చరిత్రలో ప్రభంజనం సృష్టించి రాజకీయాల్లో అడుగుపెట్టి గొప్ప సంస్కరణలకు తెర తీశారని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో ఎన్టీ రామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీ రామారావుతో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలిసి చేశానన్నారు. తమ ఇద్దరి అనుబంధం ఎంతో ప్రత్యేకమైందని, తాను గుడివాడ ఆర్డీవోగా ఉన్నప్పుడు ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేశారని, ఆ సమయంలో రిటర్నింగ్ అధికారిగా ఉన్నానని, నామినేషన్ పత్రాలు తీసుకోవడం, గెలిచిన తరవాత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడం మధురమైన క్షణాలని గుర్తు చేసుకున్నారు. రెండోసారి సీఎంగా ఎన్నికైనప్పుడు గుంటూరు జేసీగా ఉన్న తనను ఆయన కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా తీసుకున్నారన్నారు. అవినీతి సహించేవారు కాదని, ఆయన సంస్కరణలు ఎందరో జీవితాలను మార్చాయని కొనియాడారు. తెలుగు వారిపైన పడిన మదరాశీలు అనే ముద్రను తొలగించి, ఆంధ్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆ మహనీయుడి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని ఎన్టీఆర్‌తో ఉన్న తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏపీపీసీబీ సభ్యకార్యదర్శి, చీఫ్ ఎన్విరాన్‌మెట్ ఇంజనీర్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఏపీపీసీబీ సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేదపండితుని దూషించిన అధికారికి మందలింపు

ఇంద్రకీలాద్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఓ వేద పండితుడిని ఓ అధికారి దూషించిన సంఘటనపై ఈవోకు ఫిర్యాదు చేయటంతో ఆ అధికారిని మందలించినట్టు సమాచారం. 3 రోజుల క్రితం దేవస్థానంలో జరిగిన పల్లకిసేవలో ఓ అధికారి కీర్తనలు పాడాలని వేద పండితులకు, అర్చకులకు సూచించారు. అదేంటని ప్రశ్నించడంతో ఆ అధికారి వేదపండితుడిపై పరుష పదజాలం వాడాడు. అప్పుడే అక్కడకు వచ్చిన ఈవో ఏంటిని అడగటంతో వేదపండితుడు వివరించాడు. దీంతో ఈవో ఆ అధికారిని మందలించినట్టు తెలిసింది. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ దృష్టికి వెళ్లగా ఈవోకు ఫోన్ చేసి పలు సూచనలు చేసినట్టు తెలిసింది.

ఎన్టీఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఉద్యోగిగా, కళామతల్లి ముద్దుబిడ్డగా పేద ప్రజల గుండె చప్పుడుగా క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగించిన ఎన్టీఆర్ అందుకున్న కీర్తిప్రతిష్టలు అజరామరమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పేదలకు సేవలందించడం ద్వారా ఎన్టీఆర్ జిల్లాకు మరింత ఖ్యాతిని తీసుకొద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఎన్టీఆర్ జీవిత విశేషాలపై జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కళాక్షేత్ర నాట్య అకాడమీ, భాగవతుల వెంకట రామశర్మ శిష్యబృంద సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. నాట్యాచార్యులు భాగవతుల వెంకట రామశర్మ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకుడు ఎం.దుర్గాప్రసాద్, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహన్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, మీడియా సమన్వయకర్త వీవీ ప్రసాద్, డీఈఓ యూవీ సుబ్బారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎర్త్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

హీరోస్ ఫౌండేషన్ భన్సీ, డిప్యూటీ డైరెక్టర్ చంద్రిక పాల్గొన్నారు.

ఏడీసీ ప్రధాన కార్యాలయంలో

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని ప్రతి ఏటా మే 28న రాష్ట్ర కార్యక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం (జీఏడీ) నుంచి ఆదేశాలు జారీ చేసింది. దీన్ని పురస్కరించుకొని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఏడీసీ ఛైర్‌పర్సన్, ఎండీ డి.లక్ష్మీ పార్థసారధి ఎన్టీఆర్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏడీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం

సత్యనారాయణపురం: మానసిక ప్రశాంత ఉంటేనే సురక్షితమైన ప్రయాణ చేయగలమని, యోగాసనాల ద్వారానే మానసిక ప్రశాంతత వస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కాలేజీ జంక్షన్ వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనచోదకులకు నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని యోగసనాలు వేశారు. ఆర్‌డీవో కావూరి చైతన్య, వీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్‌టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, కె.భద్రచలం, డ్రైవర్లు రవాణ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం

» ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మచిలీపట్నం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ అన్నారు. బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని మచిలీపట్నంలోని జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో జిల్లాస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాలోని నిమ్మకూరుగ్రామంలో పుట్టి తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారక రామారావు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగినా ఎప్పుడూ దర్పాన్ని ప్రదర్శించలేదని, ముఖ్యమంత్రిగా సుపరిపాలన అందించి పేద ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండిరామకృష్ణ, డీఆర్వో చంద్రశేఖర్, గొర్రెపాటి గోపీచంద్, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, టీడీపీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

అసత్య ప్రచారం మానుకోవాలి

● రైతు సంఘాలకు నందిగామ డీసీ చైర్మన్ చంద్రశేఖర్ హితవు

నందిగామ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌పీ నీరు వేదాద్రి పైప్‌లైన్ ద్వారా కృష్ణానదిలోకి వెళుతున్నాయంటూ కొందరు రైతు సంఘాల నేతలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం సరికాదని ఎన్‌ఎస్‌పీ నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేదాద్రి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్లు బండిపాలెం వద్ద ఎన్‌ఎస్‌పీ కాలువకు అనుసంధానంగా ఉన్నాయన్నారు. వేదాద్రి పథకం మరమ్మతులకు గురికావడంతో బండిపాలెం కాలువ వద్ద కొందరు రైతులు పైప్‌లైన్ గేట్లు ధ్వంసం చేశారన్నారు. దీంతో కొద్దిపాటి నీరు ఆ పైపుల ద్వారా ఆ ప్రాంత పొలాలకు వెళుతున్నట్టు చెప్పారు. వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతుల్లో భాగంగా గేట్లు పటిష్ట పరిచే చర్యలు చేపడుతున్నందున ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఎన్‌ఎస్‌పీ నీరు వేదాద్రి పైప్‌లైన్‌ల ద్వారా కృష్ణానదిలో కలవాలంటే సుమారు 200 మీటర్ల మేర కొండెక్కి ప్రవహించాలన్నారు. గ్రావెటీపై అంత ఎత్తుకు నీరెలా ఎక్కుతుందని ప్రశ్నించారు. రైతు సంఘాల నేతల విమర్శల వల్ల రైతులకు తప్పుడు సమాచారం చేరుతుందన్నారు. వేదాద్రి మరమ్మతుల కోసం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఎంతో కృషి చేస్తున్నారని, త్వరలో నిధులు సమీకరించి మరమ్మతులు చేయిస్తారన్నారు.



కేసు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

మేడూరు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

రూ. 3.50లక్షల ఆభరణాలు స్వాధీనం

పమిడిముక్కల, మే 28 (ఆంధ్రజ్యోతి): మేడూరులో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టుచేసి అతడి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారు, కేజీ వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. పమిడిముక్కల స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. మేడూరులో గతేడాది అక్టోబరు 23న వేర్వేరు ఇళ్లలో బంగారం, వెండి వస్తువులు చోరీ జరిగినట్టు రెండు కేసులు నమోదయ్యాయి. మొవ్వ గ్రామానికి చెందిన కాగిత పవన్‌కుమార్ గడ్డిపాడు అడ్డరోడ్డు విద్యుత్ ఆఫీసు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్ట్ చేసి విచారించగా చోరీని అంగీకరించాడు. తాళంవేసి ఉన్న ఇళ్లలో రాత్రి తాళం పగులగొట్టి దొంగతనం చేస్తాడన్నారు. నిందితుడిపై పలు స్టేషన్లలో కేసులున్నట్టు తెలిపారు. బంగారం, వెండితో పాటు మోటార్ సైకిల్ స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు. సీఐ వై.చిట్టిబాబు, సీసీఎస్ సీఐ బి.రమణి, ఎస్సై శ్రీనివాస్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ రషీద్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సుధీర్‌ను అభినందించి రివార్డు ఇచ్చారు.

రెరా ఫిర్యాదులను సంతృప్త స్థాయిలో

పరిష్కరించాలి

» అన్ని లే అవుట్లు, నిర్మాణాలను రెరా పరిధిలోకి తేవాలి

» జాతీయ ప్రాజెక్టుల సత్వర పూర్తికి సీఎస్‌లు చొరవ చూపాలి: మోదీ

» ప్రాజెక్టుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)కి అందే ఫిర్యాదులన్నింటినీ ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించి, వారి నుంచి సంతృప్తి లేఖను తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారు. కొనుగోలుదారులకు అన్యాయం జరగకుండా అన్ని లే అవుట్లను, నిర్మాణాలను రెరా పరిధిలోకి తీసుకురావాలని నిర్దేశించారు. బుధవారం అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో ప్రధాని వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు జాతీయ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ రెరా చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను పెంచుతూ పారదర్శకతతో మంచి పాలన ప్రజలకు అందించాలన్నారు. జాతీయ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు అన్ని రాష్ట్రాల సీఎస్‌లు ప్రత్యేక చొరవ చూపాలని, లేకుంటే ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరిగిపోతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా వందకుపైగా అణు విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని, వీటి నిర్మాణంపై ఐటీఐల్లో కూడా కోర్సులను ప్రవేశపట్టనున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రం నుంచి సీఎస్ విజయానంద్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పాల్గొన్నారు.

షరతులతో బోరుగడ్డకు బెయిల్

నరసరావుపేట లీగల్, మే 28 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.గాయత్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో మార్చి 24 నుంచి రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డకు కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. మూడు నెలలపాటు ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరై సంతకం పెట్టాలని షరతు విధించింది.

తెలియదు.. గుర్తులేదు

» పోలీసుల విచారణలో నందిగం జవాబులు

తుళ్లూరు, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తను చితకబాదిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు బుధవారం విచారించారు. అయితే విచారణలో తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా.. అనే సమాధానాలనే సురేశ్ ఇచ్చినట్లు సమాచారం. గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న సురేశ్‌ను మూడు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సురేశ్‌ను విచారణకు తుళ్లూరుకు తీసుకొచ్చారు.

గోవిందప్పకు జైల్లో ప్రత్యేక సౌకర్యాలు

విజయవాడ, మే 28(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ గోవిందప్పకు జైలు అధికారులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చిన మేరకు ఆయనకు బుధవారం ఇనుప మంచం, పరుపు, దిండు ఏర్పాటు చేశారు. తనకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలన్న పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. గురువారం కోర్టు తీర్పు ఇవ్వనుంది.

అంతర్రాష్ట్ర.. శిశు విక్రయ ముఠాకు బేడీలు

» 13 మంది ముఠా సభ్యుల అరెస్టు

» 28 మంది శిశువులను విక్రయించిన గ్యాంగ్

» 10 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు

» నల్లగొండ శిశువిహార్‌కు తరలింపు

» అల్లారుముద్దుగా చూసుకున్నామంటూ.. పెంచుకున్న తల్లిదండ్రుల ఆందోళన

సూర్యాపేటక్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులు మొదలు.. నెలల వయసున్న చిన్నారులను విక్రయించే ఘరానా అంతర్రాష్ట్ర ముఠా ఆటను సూర్యాపేట పోలీసులు కట్టించారు. ముఠాలోని 13 మందిని అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు 28 మంది శిశువులను విక్రయించగా.. వారిలో 10 మందిని కాపాడి, శిశువిహార్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వివరాలను వెల్లడించారు. శిశు అక్రమ రవాణాపై ఉప్పందుకున్న పోలీసులు.. ఇటీవల ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న దంపతులను అదుపులోకి తీసుకుని, విచారించారు. వారు వెల్లడించిన వివరాలతో సూర్యాపేట పట్టణంలో నివసించే కోడిగుడ్ల వ్యాపారి నక్క యాదగిరి, అతని భార్య ఉమారాణిలను ప్రశ్నించగా.. ఘరానా ముఠా గుట్టు రట్టయింది. బుధవారం ఉదయం వలపన్నిన పోలీసులు 13 మందిని అరెస్టు చేశారు. వీరంతా ఓ చైన్‌మాదిరిగా కలిసి, ముఠాను ఏర్పాటు చేశారని ఎస్పీ వివరించారు. ఈ ముఠా ఇప్పటి వరకు రాజస్థాన్, అహ్మదాబాద్ నుంచి అక్రమంగా రూ.50 వేలకు ఒకరు చొప్పున చిన్నారులను కొని, ఇక్కడ రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. "ఈ ముఠా ఇప్పటి వరకు 28



సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో శిశు విక్రయాల కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

మంది శిశువులను విక్రయించింది. వారిలో.. సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన ఇద్దరు, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు, పెన్‌పహాడ్‌లో ఒకరు, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌లో ఇద్దరు, చిన్న సూరారంలో ఒకరు, హైదరాబాద్‌లో ఒకరితో కలిపి మొత్తం 10 మంది పిల్లలను సంరక్షించాం. వీరిలో ముగ్గురు ఆడశిశువులున్నారు. మిగతా 18 మంది పిల్లలను కూడా కాపాడుతాం" అని ఎస్పీ చెప్పారు. ముఠా సభ్యుల్లో ఒకరైన శారద ఇప్పటికే శిశు విక్రయాల కేసులో లఖ్‌నవూ జైలులో ఉన్నారని, విజయలక్ష్మిపై మునగాల, జనగాంతోపాటు.. ఏపీలోని ఏలూరు, మంగళగిరి ఠాణాల్లో కేసులున్నట్లు తెలిపారు. ఇంతకాలం పిల్లలను పెంచుకున్న తల్లిదండ్రులు సూర్యాపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలను తమకు అప్పగించాలంటూ కన్నీటిపర్యంతంతో పోలీసులను వేడుకున్నారు. .

పారదర్శకమే... కాని ఏకపక్షం

» మార్కెటింగ్ శాఖలో బదిలీలపై భిన్నాభిప్రాయాలు

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. బదిలీల విషయంలో సంబంధిత ఉన్నతాధికారి పారదర్శకంగా నిర్వహించినట్లు అధికార వర్గాలు చెప్తున్నా, ఉన్నతాధికారి ఏకపక్షంగా నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. ఉద్యోగుల బదిలీల విషయంలో తాము కోరుకున్న పోస్టులు పొందటానికి ముందే కొందరు ఒప్పందాలు చేసుకున్నారు. అవసరమైతే ముడుపులు ఇచ్చుకోవటానికి సిద్ధపడ్డారు. విషయం తెలిసిన సంబంధిత మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ డైరెక్టర్ పారదర్శకంగా బదిలీల ప్రక్రియను నిర్వహించారని సమాచారం. సాధారణ బదిలీలకు ఈ శాఖలో దాదాపు 250 మంది అర్హులుగా ఉండగా, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు దాటిన వారితో పాటు రెండేళ్లు నిండి బదిలీ కోసం ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులనూ డైరెక్టర్ విజయ సునీత నేరుగా పరిశీలించారని సమాచారం. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బందితో కలసి అర్ధరాత్రి వరకు డైరెక్టర్ ప్రతి దరఖాస్తునూ నేరుగా పరిశీలించి, ఉద్యోగులను పిలిచి మాట్లాడారని తెలిసింది. కౌన్సెలింగ్ విధానంలో బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు పలువురు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు

» ఆంధ్రజ్యోతి కథనంపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ వివరణ

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయ శాఖలో జోనల్ స్థాయి, రాష్ట్ర కేడర్‌కు... కౌన్సెలింగ్ కమిటీల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తాం. వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారమే ఉన్నతాధికారుల ఆమోదంతో గడువులోగా బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తాం' అని ఆశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'యూనియన్ల హవా' శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. 'సాధారణ బదిలీలకు సంబంధించి ప్రభుత్వ జీవో 23 ప్రకారం వ్యవసాయ శాఖ ఉద్యోగుల బదిలీలకు విధి విధానాలు రూపొందించాం. బదిలీలకు అర్హులైన ఉద్యోగుల నుంచి దరఖాస్తులు తీసుకున్నాం. ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత లేని వాటిని తొలగించాం. తుది జాబితాను ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాం. నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తాం. ఐదేళ్లు దాటిన కొంత మంది ఉద్యోగులకు రిటెన్షన్ ఇవ్వలేదు. జీవో ప్రకారం స్టేషన్ సీనియారిటీని పరిగణలోకి తీసుకుని, అర్హులైన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తాం. ఆఫీస్ బేరర్స్ అయినా పరిపాలనాపరమైన అవసరం కోసం నిబంధనల ప్రకారం బదిలీ చేసే అవకాశం ఉంది' అని ఢిల్లీరావు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి నాంది ఎన్టీఆర్

» రాష్ట్ర సచివాలయంలో ఘనంగా జయంతి వేడుకలు: సీఎస్ విజయానంద్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎస్ విజయానంద్

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రఖ్యాత తెలుగు నటుడిగానే కాకుండా రాజకీయ జీవితంలో కూడా ఆదర్శవంతంగా నిలిచారు. పేదల సంక్షేమానికి అనేక వినూత్న కార్యక్రమాలకు నాంది పలికారు. ప్రజలకు ఆయన చేసిన ఎనలేని సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా మే 28న ఆయన జయంతిని రాష్ట్ర వేడుకగా జరపాలని నిర్ణయించింది' అని అన్నారు. అమరావతి అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి.

దివ్యాంగుల కార్పొరేషన్ ఎండీగా కుమార్‌రాజా

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ ఎండీగా కుమార్ రాజాను పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పునర్నియామకం చేసింది. దీంతోపాటు ఆయనపై వచ్చిన ఆరోపణల విచారణకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి ఆదేశాలు ఇచ్చింది. మహిళా,శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ హైకోర్టు సీజేగా అపరేశ్ కుమార్ సింగ్

» కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు



చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్

హైదరాబాద్, న్యూఢిల్లీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్(ఏకే సింగ్) నియామకం కానున్నారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయినప్పటి నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్ సేవలు అందిస్తున్నారు. ఆయన్ను కోల్‌కతా హైకోర్టు జడ్జిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మరోవైపు తెలంగాణ హైకోర్టులో నాలుగో సీనియర్ జడ్జిగా ఉన్న జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నిర్ణయాలను ఈ నెల 26నే తీసుకున్నా నోటిఫికేషన్లు మాత్రం తాజాగా బుధవారం వెలువడ్డాయి. అలాగే ఇప్పటికే తెలంగాణ హైకోర్టు నుంచి వివిధ రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయిన జస్టిస్ సి. సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ ఎ. అభిషేక్‌రెడ్డి మళ్లీ తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం వెలువడింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును కొట్టేయండి

» సుప్రీంకోర్టులో సినీ నటుడు మంచు విష్ణు పిటిషన్



న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసును కొట్టివేయాలని కోరుతూ సినీ నటుడు మంచు విష్ణు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజకీయాలతో సంబంధం లేని తనపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేయడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 2019లో తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారిపై విద్యార్థులతోపాటు మంచు కుటుంబం ధర్నాకు దిగింది. అయితే, అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మోహన్‌బాబు, ఆయన కుమారులు విష్ణు, మనోజ్‌తోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసులో తనను క్వాష్ చేయాలని కోరుతూ మార్చి 30న మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తిరుపతి మేజిస్ట్రేట్ ఎదుట విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని మోహన్‌బాబు కోరగా, ధర్మాసనం నిరాకరించింది. అదే కేసులో ఈ నెల 21న విష్ణు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది. మంచు విష్ణు తరఫున న్యాయవాదులు పాయ్ అమిత్, పీ భరద్వాజ్, కౌషల్ దుబే హాజరయ్యారు. ఇదే కేసుకు సంబంధించి మోహన్‌బాబు పిటిషన్‌పై విచారణ జూలై 15కు ఉందని, విష్ణు పిటిషన్‌ను సైతం దానితో కలిపి విచారించాలని పాయ్ అమిత్ కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న ఏపీ ప్రభుత్వంతోపాటు కే హేమలతకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు సమాధానమివ్వాలని ఆదేశించింది.

నడ్డాతో బీజేపీ రాష్ట్ర నేతల భేటీ

» ఆర్‌డీటీ సేవలను కొనసాగించేలా చూడండి

» కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మంత్రి సత్యకుమార్ వినతి

న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ భేటీ అయ్యారు. బుధవారం, రాజ్యసభ ఎంపీగా సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నడ్డాతో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మరోవైపు అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ)కి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మంత్రి సత్యకుమార్ కోరారు. గత 55 ఏళ్లుగా ఆర్‌డీటీ అందిస్తున్న సేవలను కొనసాగించడానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

థియేటర్ తనిఖీ

కృత్తివెన్ను, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం లక్ష్మీపురం గ్రామంలోని సినిమా థియేటర్‌ను డిప్యూటీ తహసీల్దార్ శశికుమార్ తనిఖీ చేశారు. థియేటర్‌లో వసతులు, పార్కింగ్ ఫీజులు, టికెట్ ధరలు, తినుబండారాల విక్రయాలు, ప్రేక్షకుల ఇబ్బందులపై వివరాలు సేకరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ, మే 28(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామనిన డిపో మేనేజర్ కె.హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలను 99592 25466కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.



మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ఎస్పీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు



ఘంటసాలలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నేతలు



పెడనలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

యుగపురుషుడు ఎన్టీఆర్

వాడవాడలా జయంతి వేడుకలు ● నివాళులర్పించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు యుగపురుషుడు అని టీడీపీ నేతలు, కార్యకర్తలు కొనియాడారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను వాడవాడలా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఎన్టీఆర్ జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు.

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/ఘంటసాల/చల్లపల్లి/మోపిదేవి/నాగాయలంక/కోడూరు/పెడన/పెడన రూరల్/గూడూరు/బంటుమిల్లి/కృత్తివెన్ను, మే 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి వెంకటస్వామి, పంచపర్వాల కాశీవిశ్వనాథం, ఎండీ ఇలియాస్ పాషా, లంకే నారాయణప్రసాద్, పి.వి.ఫణికుమార్, లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ నివాళులర్పించారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

ఘంటసాల మండలం తాడేపల్లి, ఘంటసాలలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. కొడాలిలో టీడీపీ కార్యాలయం వద్ద మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మల జనార్దన బాబుతో కలిసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కేక్ కట్ చేశారు. తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్‌చంద్రబోస్, అయినపూడి భానుప్రకాష్, బండి పరాత్పరరావు, గొర్రెపాటి వెంకటరామకృష్ణ పాల్గొన్నారు. టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో సీనియర్ నేత, కనకదుర్గమ్మ ఆలయ పాలకవర్గ మాజీ సభ్యురాలు విశ్వనాథపల్లి పాప, మాజీ ఎంపీపీ బండే నాగ వెంకట కనకదుర్గ కేక్ కట్ చేశారు. గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, కూటమి నేతలు మత్తి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, అన్నపరెడ్డి వెంకట స్వామి, బచ్చు రఘునాథ్ పాల్గొన్నారు. పులిగడ్డ రేగుల్లంక అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో టీడీపీ స్థూపం దగ్గర పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు జెండా ఎగరేశారు. నాగాయలంకలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీ పీ నాయకులు మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, ఉప్పు ల ప్రసాద్, కన్నా నాగరాజు నివాళులర్పించారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి సీనియర్ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావు దంపతులు నివాళులర్పించారు. పార్టీ జెండాను టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు ఎగరేశారు. ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు. పాగోలులో ఎన్టీఆర్ విగ్ర హానికి మేకా వెంకటేశ్వరరావు, వేమూరి రమేష్‌బాబు, మేకా పెద్దబ్బాయ్ నివాళులర్పించారు. పురిటిగడ్డలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ నివాళులర్పించారు. మోపిదేవి ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీ పీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, ఎంపీపీ రావి దుర్గావాణి నివాళులర్పించారు. రావి నాగేశ్వరరావు, మోర్ల జయలక్ష్మి, మాతంగి వెంకటేశ్వరమ్మ, బల్లా సీతారామప్రసాద్, చందన రంగారావు, దిడ్ల జానకి రాంబాబు పాల్గొన్నారు. తహసీల్దార్, మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. పెదప్రోలులో సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, మోపిదేవి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నందిగం మేరీ రాణిలు ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కోడూ రు గొల్లపాలెం రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్ పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు, మాచర్ల భీమయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను కోడూరు ప్రధాన సెంటర్‌లో నిర్వహించారు. మర్రే గంగయ్య, బడే భావన్నారాయణ పాల్గొన్నారు.

పెడన నియోజకవర్గంలో..

బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు నేతృత్వంలో పెడన బస్టాండ్ సెంటర్‌లోని టీడీపీ స్థూపం వద్ద నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రదర్శనగా బయలుదేరి 14వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. పార్టీ పట్టణ నాయకులు యక్కల శ్యామలయ్య, అబ్దుల్‌ఖయ్యూం, చందన నారాయణరావు పాల్గొన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ మన్నం గోపాలరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణకుమారి తమ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. శేరీవర్తర్లపల్లి పంచాయతీ వద్ద పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉరివిలో గంధం గోపాలకృష్ణ, చోడవరంలో జ్వాలాబాబు, కొప్పల్లిలో కాగిత వాసు, నందమూరు, జింజేరు, గౌడపాలెం, కొంకేపూడి, పెనుమల్లి, లంకలకలవగుంట, నడుపూరు, కూడూరు, నందిగం, బల్లిపర్రు గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిపారు. గూడూరు సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, గోపీ నాగబాబు, కట్టా మునీశ్వరరావు, ఎస్‌ఏ బేగ్ తదితరులు నివాళులర్పించారు. టీడీపీ బంటుమిల్లి మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో బంటుమిల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి, అర్తమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. బొర్రా కాశీ, యిల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్, నూర్ పాల్గొన్నారు. కృత్తివెన్ను టీడీపీ కార్యాలయం, యండపల్లిలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, పార్టీ కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖాధికారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల్లో చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పారదర్శకంగా పనులు నిర్వహించాలని అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం అవనిగడ్డలోని తన కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ.2,25,09,00తో కేఈబీ సహా నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాల పరిధిలో చేపట్టిన పంట కాలువల్లో తూటుకాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ.2.83 కోట్లతో చేపట్టిన పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు(చిన్నబాబు), అయినపూడి భానుప్రకాష్, ఇరిగేషన్ ఈఈ ఆర్.రవికిరణ్, డ్రెయినేజీ శాఖ ఈఈ బి.కిరణ్‌బాబు, డ్రెయినేజీ, ఇరిగేషన్‌శాఖల డీఈలు జె.బాబూనాయక్, ఏఈఈలు వెంకటేశ్వరరావు, రాంకుమార్, చిరంజీవి, రవితేజ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహనీయుడు సద్గురు మలయాళస్వామి

ఘంటసాల, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతిని ఆధ్యాత్మికత వైపు నడిపిన మహనీయుడు సద్గురు మలయాళస్వామి అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తాడేపల్లిలో సద్గురు మలయాళస్వామి వృద్ధాశ్రమం ప్రాంగణంలో రూ.10 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త దోనేపూడి శాయిజీరావు తన తల్లి మునేశ్వరమ్మ జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రావి శారద, బొబ్బా పద్మ, ఆశ్రమ నిర్వాహకులు కావూరి కోదండరామయ్య, గొర్రెపాటి సురేష్, మొవ్వ శ్రీరామ్మూర్తి, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్‌చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ పాల్గొన్నారు.

పంట కాలువ సర్వే

గూడూరు, మే 28(ఆంధ్రజ్యోతి): రామరాజుపాలెం నుంచి ఆకుమర్రు, గొల్లపాలెం పంట పొలాలకు సాగునీరు వెళ్లే పంట కాలువ ఆక్రమణలకు గురైందని రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వేయర్ మురళీకృష్ణ సిబ్బందితో పంటకాలువ సర్వే చేపట్టారు. ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తుతో రైతుల సమక్షంలో అధికారులు సర్వే నెంబర్ల వారీగా హద్దులు నిర్ధారిస్తూ సర్వే చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

బంటుమిల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జూన్ 5వ తేదీన నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వారు బుధవారం విడుదల చేశారు. బంటుమిల్లి మండల పరిషత్, విద్యాశాఖ, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. గంటా రామకృష్ణ, డాక్టర్ ఎన్.సుశాంత్, జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు.. ఏడు బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడితో సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై పైడిబాబు

కృత్తివెన్ను, మే 28(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై, బైక్‌లను దొంగలిస్తున్న ఓ యువకుడితో పాటు మరో బాలుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలను సీఐ నాగేంద్రప్రసాద్ కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 'మండల పరిధిలోని పల్లెపాలెం వద్ద ఎస్సై పైడిబాబు తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, భీమవరం వైపు నుంచి నెంబర్ ప్లేట్లు లేని రెండు బైక్‌లపై వస్తున్న ఇద్దరు.. అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా, భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన విల్లూరి సుధీర్‌బాబు(19)గా గుర్తించారు. మరో మైనర్ బాలుడితో కలిసి చెడు వ్యసనాలకు బానిసై, కొంతకాలంగా బైక్‌లను దొంగలిస్తున్నారని విచారణలో తేలింది. దొంగిలించిన బైక్‌లను మండల పరిధిలోని పడతడిక వద్ద ముళ్లపొదల్లో దాచి ఉంచారు. వాటిని విక్రయించే క్రమంలో పోలీసులకు చిక్కారు. వారి నుంచి 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నాం. అందులో నాలుగు కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలోవి. రెండు బంటుమిల్లి స్టేషన్, మరొకటి భీమవరం రూరల్ స్టేషన్ పరిధిలో బైక్‌లుగా గుర్తించాం. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించాం.' అని సీఐ తెలిపారు.

వృద్ధురాలి శరీరదానం



కోగంటి లీలాకుమారి (ఫైల్)

చల్లపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరికి ఉపయోగపడాలని, తన మృతశరీరం వృథాగా కాలిపోవటం ఇష్టంలేదని, వైద్యవిద్యార్థులకు దానం చేయాలని వృద్ధురాలి కోరిక మేరకు ఆమె శరీరాన్ని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు కుటుంబసభ్యులు దానం చేశారు. నిమ్మగడ్డ గ్రామానికి చెందిన కోగంటి లీలాకుమారి(74) మృతిచెందగా మేనల్లుడు మాలెంపాటి చక్రధర చౌదరి-జ్యోతిలు నాగాయలంక సుదర్శి మానవతాసేవాసంస్థ ఆధ్వర్యంలో లీలాకుమారి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు, శరీరాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు బుధవారం దానం చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కోడూరు, మే 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పాలకాయితిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలకాయితిప్ప మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో పాలకాయితిప్పలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు, మెమొంటోలు, సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కోడూరు ఎస్సై చాణక్య, మెరైన్ ఎస్సై పూర్ణమాధురి, తీర ప్రాంత క్రీడాకారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

30న మండల కార్యాలయంలో రక్తదాన శిబిరం

పెడన, మే 28 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈనెల 30న మండల పరిషత్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. రక్తదానం చేసేవారు మండల పరిషత్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

యోగాంధ్ర ర్యాలీలు



మండల పరిషత్ ఆధ్వర్యంలో మోపిదేవి, బంటుమిల్లిలో ర్యాలీలు

అవనిగడ్డ/మోపిదేవి/చల్లపల్లి/పెడన రూరల్/ బంటుమిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అవనిగడ్డలో సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బందితో కలిసి ఎంపీడీవో మరియకుమారి ర్యాలీలో పాల్గొన్నారు. మోపిదేవిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీడీవో జె.స్వర్ణభారతి ర్యాలీని ప్రారంభించారు. ప్రధాన కూడలి వెంబడి నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు పాండురంగారావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్, కడవకొల్లు సీతారామాంజనేయులు, చందన రంగారావు, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కె.రామకోటేశ్వరరావు, సుధాకర్, మోహనకృష్ణ పాల్గొన్నారు. పెడనలో బస్టాండ్ నుంచి బంటుమిల్లి రోడ్డు మీదుగా తోటమూల కాలనీ వరకు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులతో కలిసి ఎంపీడీవో ఎ.అరుణకుమారి ర్యాలీ చేశారు. బంటుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఎంపీడీవో నీరజాక్షి , ఆర్ఐ శంకర్, వ్యవసాయశాఖ ఏవో శివరామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏపీఎం దశరథరామయ్య పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చల్లపల్లి పంచాయతీ పరిధిలోని 1, 2, 3 సచివాలయాలలో ఉద్యోగులకు, పంచాయతీ అధికారులకు యోగాపై అవగాహన కల్పించి యోగాసనాలు వేయించారు. మంగళాపురం జడ్పీహైస్కూల్ పీఈటీ శ్రీరామకృష్ణ, యోగాగురువు ఎన్.వెంకటేశ్వరరావులు, జిల్లాస్థాయి మానిటరింగ్ అధికారిణి ఎంఎస్.ప్రసన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.రవిశంకర్ పాల్గొన్నారు.



కొక్కిలిగడ్డ పరిధిలో మట్టి మాఫియా తవ్వేసిన డ్రెయినేజీ గట్టు

మట్టి మాఫియా ఆగడాలు

● డ్రెయినేజీ గట్టును రాత్రికి రాత్రే తవ్వి, మట్టి విక్రయాలు

మోపిదేవి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అతిపెద్ద డ్రెయిన్ మంగళవాని శింకు. కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, మోపిదేవి, వెంకటాపురం, పెదకళ్లేపల్లి వరకు ఉన్న ఈ డ్రెయిన్ వేలాది ఎకరాల మురుగునీటిని కృష్ణానదిలోకి కలుపుతుంది. కొక్కిలిగడ్డ పంచాయతీ పరిధిలో మంగళవాని శింకు డ్రెయినేజీ కాలువ గట్టును మట్టి మాఫియా రాత్రికి రాత్రే 150 మీటర్లకుపైగా తవ్వకుని మట్టిని అమ్మేసింది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆనవాలుగా కొంతమేర గట్టును వదిలారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండురోజులు గడిచినా తవ్విన ప్రదేశాన్ని పరిశీలించలేదని గ్రామస్థులు చెబుతున్నారు. డ్రెయినేజీ కాలువ గట్టు మట్టిని తవ్విన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మనోహర్

సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు

ఘంటసాల, మే 28(ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, సేంద్రియ సాగు వైపు రైతులు మళ్లాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్వీఎస్ మనోహర్ సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో మద్రాసు ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతులు, పీఎం ప్రణామ్ కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట సాగు వల్ల భూసారం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఖరీఫ్ సార్వా సాగులో విత్తనం ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సుధారాణి వివరించారు. సంస్థ పరిధిలోని ఆర్గానిక్ ఎరువులపై రైతులకు మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఫలితాల పత్రాలను రైతులకు శాస్త్రవేత్తలు అందజేశారు. వ్యవసాయ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతిరమణి, ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీకి బొబ్బా గోవర్ధన్ రూ.10 లక్షల విరాళం

అవనిగడ్డ, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో బుధవారం నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ పార్టీకి రూ.10 లక్షలు విరాళం అందజేశారు. మంత్రి నారా లోకేశ్‌కు ఆయన చెక్కును అందజేశారు. మహానాడుకు వచ్చే కార్యకర్తల కోసం ప్రత్యేకంగా బస్సులు, వాహనాలు సమకూర్చిన గోవర్ధన్‌ను లోకేశ్ అభినందించారు.

సంపద సృష్టి కేంద్రాల పరిశీలన

అవనిగడ్డ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ అప్పల నరసమ్మ పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారు చేయడంలో పంచాయతీ ముందు వరుసలో ఉందని ఆమె తెలిపారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బి.అనిత పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

మహానాడుకు తరలిన టీడీపీ నేతలు

కూచిపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో మొవ్వ నుంచి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. రాజులపాటి పెద్ద మస్తాన రావు, పామర్రి శివకుమార్, పామర్రి పాండురంగారావు, వెంపటి గోపాల కృష్ణ, ఒడుగంటి నాగరాజు, వీర్ల నరేష్, కాకర్ల వాసు, ఉప్పలపు నాగరాజు, ఈడే నాగేశ్వరరావు, ప్రసాదులు మహానాడుకు తరలివెళ్లారు.


కూచిపూడి నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నేతలు

సినీ థియేటర్ల ఆకస్మిక తనిఖీలు

గుడివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జికె సింధూర, భాస్కర్, నెక్ట్ థియేటర్ కాంప్లెక్స్‌లలో బుధవారం ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం తనిఖీలు నిర్వహించారు. ప్రేక్షకులకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. క్యాంటీన్‌లో ధరల చార్టులు, టిక్కెట్ ధరల ప్రదర్శన తప్పనిసరి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఆర్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు :గుడ్లవల్లేరులోని రామకృష్ణా థియేటర్‌లో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. గత నాలుగైదు రోజులుగా థియేటర్‌కు ప్రేక్షకులు ఎవరూ రాక సినిమా ప్రదర్శించడంలేదని సిబ్బంది తెలిపారు. థియేటర్‌లో వసతులు, రికార్డులను తహసీల్దారు లోకరాజు పరిశీలించారు.

పామర్రు: పామర్రులో గల మూడు సినిమా థియేటర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసిల్దార్ జి.రవికాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రేక్షకులకు అందించే సౌకర్యాలతోపాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుసరించవలసిన చర్యలు గురించి వాటి యాజమనులతో చర్చించారు. కొత్త సినిమాలు విడుదల సందర్భంలో ప్రభుత్వం సూచించిన ధరలకే టికెట్ల విక్రయాలు జరగాలని, థియేటర్ లైసెన్సులు నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేయించుకోవాలని యాజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎ.రాము పాల్గొన్నారు.

ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించాలి

నందివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించి గ్రామాలలో ఉన్న వ్యక్తులకే పని కల్పించాలని అనమనపూడి టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం బుధవారం మండల ఎంపీడీవో మల్లేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొంతమంది గ్రామంలో ఉన్న వ్యక్తుల బదులుగా వేరొకరిని తీసుకెళ్లి వారి పేరున పడుతున్న డబ్బులు, వీరు కాజేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే సమయంలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించకపోవటంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత వైసీపీలో పనికి ఆహార పథకంలో అనేక అక్రమాలు జరిగాయని, అదేబాటలో ఇప్పుడున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు అదేబాటలో పయనిస్తున్నారన్నారు.

యుగపురుషుడు ఎన్టీఆర్

● వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


గుడివాడలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గుడివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుదిశలా చాటిచెప్పి, పేదవారికి కూడు, గూడు, గుడ్డ కల్పించిన యుగపురుషుడు నందమూరి తారకరామారావు అని పలువురు కీర్తించారు. స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. నాయకులు రాంబాబు, మురళీ, సత్యనారాయణ, పోలాసి ఉమా, గఫార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు వీరభద్రరావు పాల్గొన్నారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.ఏసుబాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని ఎన్టీఆర్ విగ్రహానికి గుడివాడ ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, పోలవరపు వెంకటరావు, చాపరాల రాజేశ్వరరావులు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను మాజీసర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు, జిల్లాపార్టీ మాజీ ఉపాధ్యక్షుడు మోహనరావులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు వల్లభనేని వంగబాబు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. డోకిపర్రులో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో గ్రామపార్టీ అధ్యక్షుడు శివప్రసాద్, శివాజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. బొమ్ములూరులో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.


నందివాడలో..

కూచిపూడి : స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మొవ్వ, కూచిపూడి గ్రామాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పామర్రు : పామర్రులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద, పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలకు పామర్రు ఎమ్మెల్యే సోదరుడు వర్ల చైతన్య టీడీపీ నేతలతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ పార్టీ నేతలు జక్కాశ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు, దాలిపర్తిప్రసాద్, ఎన్టీఆర్ విగ్రహ కమిటీ చైర్మన్‌చలపతిరావు, పాల్గొన్నారు.

టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు స్వగ్రామమైన నిమ్మకూరులో గ్రామపార్టీ నేతృత్వంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలకు గ్రామపార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పడమటశ్రీనువాసరావు, ఉపసర్పంచ్ నందమూరి ప్రసాద్, శివరామకృష్ణ, కుదరవల్లి రఘురామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పామర్రులో నివాళులర్పిస్తున్న వర్ల చైతన్య, టీడీపీ నేతలు

ఎన్టీఆర్ అత్తాగారి గ్రామమైన కొమరవోలులో గ్రామ మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీనేతలు పెనుమూడి లక్ష్మణరావు, రాజారావు, నీటి సంఘం అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, కోనేరు వేణుబాబు, గోరిపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా పెదమద్దాలిలో విశ్రాంత డిఫెన్సు ఉన్నతాధికారి వీరమాచినేని వేంకటేశ్వరరావు గ్రామపార్టీ నేతలతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చలసాని దాము, యార్లగడ్డ శంకరావు, శ్యామ్, నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు, స్వామి తదితరులుపాల్గొన్నారు. జమీగోల్వేపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డెయిరి అభివృద్ధి మాజీ చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నందివాడ : మండలంలోని నందివాడ, జనార్ధనపురం, పెదలింగాల, తుమ్మలపల్లి, కుదరవల్లి, పోలుకొండ, అనుమనపూడి, తమిరిశ పలు గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు.


గుడ్లవల్లేరులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

పమిడిముక్కల : పమిడిముక్కలలో ఎన్టీఆర్ 102వ జయంతిని పలువురు బుధవారం నిర్వహించి ఘన నివాళులర్పించారు. కపిలేశ్వరపురంలో కొల్లిపర వెంకటేశ్వరరావు, లంకపణీంద్ర రావు, చిగురుపాటి జగదీశ్, కొల్లిపర బాబి, సురేశ్, కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాన సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చోరగుడి లో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, సుబ్రమణ్యం, పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. హనుమంతపురంలో లింగమనేని యూత్ ఆధ్వర్యంలో ఎన్టీఆ ర్ జయంతి ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు. పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించి ఎంపీడీవో సీతారామ రాజు, ఉద్యోగులు నివాళులర్పించారు.

పెదపారుపూడి : ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని వెంట్రప్రగడ టీడీపీ కార్యాలయంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య అధ్యక్షతన సజ్జ శివకుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎదపారుపూడి చెరువు గట్టు వద్ద ఆంజనేయస్వామి గుడి వద్ద దగ్గర కేకులు కట్ చేసి పంపిణీ చేశారు.

తోట్లవల్లూరు : గరికపర్రులో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేసి చిన్నారులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, నాయకులు గూడపాటి గిరిబాబు, రామినేని కుటుంబయ్య, వీరంకి వరహాలరావు, సూరపనేని హనుమంతరావు పాల్గొన్నారు. తోట్లవల్లూరు శాఖా గ్రంథాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి బాబూరావు పూలమాలవేసి నివాళులర్పించారు.


కేక్ కట్‌చేసి చిన్నారులకు తినిపిస్తున్న శివరామ్‌ప్రసాద్


నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

ఘనంగా వీరేశలింగం 106వ వర్ధంతి

గుడివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : అశాస్త్రీయభావాలు, మూఢనమ్మకాలు ఎక్కువగా ఉన్న కాలంలో తన కలం, గళంతో వాటిపై దండెత్తి పోరాడిన యోధుడు వీరేశలింగం అని పలువురు వ్యాఖ్యానించారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు లంకా సురేంద్ర అధ్యక్షతన వీరేశలింగం 106వ వర్ధంతి సభను నిర్వహించారు. కవయిత్రి, ఉపాధ్యాయురాలు పి.వి.వి.ఎస్ రాజకుమారి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గాంధీబాబు, ఎం.వి.జి. అంజనేయులు, రాధాకృష్ణ, సాహితీవేత్తలు సత్యనారాయణ, మాల్యాద్రి, ఏఐటీయూసీ నాయకులు కె.సురేష్, వైకోటేశ్వరరావు, జి.పీటర్ పాల్గొన్నారు.


నందివాడలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా అంతర్జాతీయ యోగా డే

నందివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా డే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ , కృష్ణా జిల్లా మెజిస్ట్రేట్ బాలాజీ వారి ఆదేశాల మేరకు బుధవారం నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్‌హాల్లో యోగా విలేజ్ లెవల్ ట్రైనర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. యోగా కార్యక్రమంపై గ్రామంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. అనతరం నందివాడ సచివాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పమిడిముక్కల, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాడంకిలో సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్థులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పూజలు, హోమాలు జరిపించి వేదమంత్రాలతో ఆగమ శాస్త్ర ప్రకారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, వ్యాపారవేత్త నూకల సాంబశివరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్న సమారాధన చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గుడివాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : నందమూరి తారకరామారావు స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో గత 28రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 28 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో 14 క్రీడాంశాల్లో 1323 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, సభ్యులు లంకదాసరి ప్రసాదరావు, మాగంటి వీరభద్రరావు, మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వివిధ క్రీడాంశాల్లో పాల్గొన్న వారి వివరాలు

అథ్లెటిక్స్‌లో 29మంది, బాస్కెట్‌బాల్‌లో 136మంది, చెస్‌లో 177మంది, క్లాసికల్ డ్యాన్స్‌లో 175మంది, క్రికెట్‌లో 128మంది, కబడ్డీలో 33మంది, కరాటేతో 116మంది, ఖో-ఖోలు 49మంది, షటిల్ బ్యాడ్మింటన్‌లో 132మంది, స్కేటింగ్‌కు 109మంది, వాలీబాల్‌కు 91, వెయిట్ లిఫ్టింగ్‌కు 24, వెస్ట్రన్ డ్యాన్స్‌కు 49మంది, యోగాకు 75మంది క్రీడాకారులు హాజరయ్యారు. శిక్షణ శిబిరానికి హాజరైన క్రీడాకారులకు కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం గుడ్డు, రాగి జావ, సాయంత్రం బిస్కెట్లు, రాగిజావాను అందజేశారు.


సర్టిఫికెట్‌లను అందజేస్తున్న శ్రీనివాసరావు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

పెదపారుపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని గ్రథాలయాధికారి ఎం.వి.ఎస్.లక్ష్మీ పేర్కొన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శతక పద్యాల - ధారణాశక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యలమర్రు శాఖ గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి, డి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

పమిడిముక్కల, మే 28 (ఆంధ్ర జ్యోతి) :అగినపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి, పూర్వఉపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు రూ. 12 వేలు విలువచేసే ప్రింటర్‌ను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్‌వీఎస్‌ఎస్ ఫణికుమార్‌కు బుధవారం అందజేశారు. విశ్రాంత సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మీర్జా అబుసిబైన్ సాహెబ్ తదితరులు దాతను అభినందించారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ


వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న శివరామ్

తోట్లవల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ అన్నారు. పెనమకూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం సబ్సీడీపై వరి విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1061, 1318 రకాల వరి విత్తనాలు 10 టన్నులు తమవద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ రెండు రకాల విత్తనాలు పది కేజీల బ్యాగ్ రూ. 1260 కాగా సబ్సీడీపై రూ.1110కి ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాముల శ్రీనివాసరావు, మరీదు పాండు, చొప్పరపు సుబ్రహ్మణ్యం, గోళ్ల శివ, అగ్రికల్చర్ అసిస్టెంట్ సృజన తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : చోరగూడి రైతు సేవాకేంద్రంలో రైతులకు వరివిత్తనాల పంపిణీని గ్రామసర్పంచ్ కందిమళ్ల పూర్ణ కుమారి బుధవారం ప్రారంభించారు. ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుబ్రమణ్యేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


వరివిత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ పూర్ణకుమారి


చీరలు పంపిణీ చేస్తున్న లింగం ప్రసాద్

వృద్ధులకు చీరల పంపిణీ

గుడివాడ, మే 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక బైపాస్‌రోడ్డులోని మమత వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ సహకారంతో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఫ్లోర్ లీడర్ లింగం ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడుపి.హరికుమార్, శ్రీచైతన్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● వైద్యాధికారి టి. సాయిప్రసన్న


తోట్లవల్లూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తోట్లవల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి టి. సాయిప్రసన్న పేర్కొన్నారు. తోట్లవల్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం రుతక్రమ పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుచి, శుభ్రత పాటిస్తే ఆనందం మన సొంతం అవుతుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేశారు. మహిళల్లో యుక్తవయస్సు నుంచి వృద్ధాప్యం వరకు రుతుక్రమ సమయంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. గర్భాధారణకు ఇబ్బంది కలిగించే అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందే అంశాలను మహిళలకు తెలియజేశారు. ఉప్పు, పంచదారను తక్కువగా తీసుకోవాలన్నారు. నూనె పదార్థాలను ఎక్కువగా వాడితే గుండె జబ్బులకు గురవుతారని ఆమె వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, హెచ్‌వీ రోహిణి, హెచ్‌ఎస్ అనీల్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాభాయి జయంతి

గుడివాడ : ఇండోర్ మహారాణి అహల్యాభాయి 300వ జయంతి సందర్భంగా స్థానిక శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆమె పేరున ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మమత వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు యర్రపోతు అర్జున్ మాట్లాడుతూ అహల్యాభాయి రాజ్యపాలనలో విదేశీరాజుల ఆక్రమణలో ధ్వంసమైన హిందూ దేవాలయాలను పునరుద్ధరించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ మట్టా ఝాన్సీ, నాయకులు సూరే గాంధీ, అంగడాల సతీష్, కిరణ్‌కుమార్, వెంకటేష్, చిన్నా, పల్లపోతు మురళీ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, తిరుపాల్ గుప్తా, రీటా, పుష్పలీల, పద్మావతి పాల్గొన్నారు.